

# అమెరికా అమ్మాయి

## – శ్రీనిధి యెల్లల



## హ్యాపీ నూతన సంవత్సరం

**ఉద్యోగాలకోసం కొందరు**, చదువుల కోసం కొందరు, ఇలా వారి వారి కలల వెంటపడి చేరుకునే గమ్యం ఒకటి ఉంది ....అదే అమెరికా!

చిన్నతనంలో ఎంతో అబ్బురంగా, స్వర్గానికి మరోపేరుగా తలచిన దేశం. అక్కడి విశేషాలు, వస్తువులు, అక్కడినుంచి వచ్చిన మనుషులూ, అందరూ ఎంతో గొప్పవారనీ దేశంలో ఎంతటి పేరున్న గుడి వారైనా పూర్ణ కుంభంతో స్వాగతం పలికేటంత వి.వి .ఐ పీలు అనీ అనుకునే రోజుల నుండీ ... "ఆ వదినా మా పిల్లకి ఆవకాయ్ పట్టడానికి సాయానికి అమెరికా వెళ్తున్నాను దార్లో మీ అబ్బాయికి ఏమైనా ఇవ్వాలంటే ఇవ్వు, ఇచ్చేసి వస్తాను" అనే రోజుల్లోకి వచ్చేసాము .

దూరం కొద్దీ విలువని అంచనా వేసే మనం, ఆ దూరం తగ్గిపోయేసరికీ విలువనీ తగ్గించేస్తున్నామేమో?

ప్రపంచంలో అందరూ రెండే రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు. ఒకళ్ళు ఉత్తములు అయితే మరొకళ్ళు అధములు. వీళ్ళు కాకుండా మరొక రకం ఉంది అదే మధ్యముల్ అన్నమాట. పై చెప్పిన రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు . వీళ్ళ గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ వారు మాత్రం అందరి సమస్యలు నెత్తిన వేస్కుని భూభారాన్ని మోసేస్తూ ఉంటారు. ఆ కేటగిరీలో ఫస్టు ఉండేవాళ్ళలో నేనొకదాన్ని. ఉద్యోగం వదిలేసి భర్త వెంట అమెరికా వాసం వచ్చిన కాండిడేట్ ని. వీసా సమస్యల వల్ల ఇంట్లో చిక్కుకుపోయి , రోజూ న్యూస్ లో వచ్చే అమెరికా వార్తలు విని నాకెప్పుడూ ఉద్యోగం వస్తుందో అని లెక్కలు వేసే చుట్టాలని మేనేజ్ చేస్తూ, ఒంటి చేత్తో ఇంటినీ, పిల్లల్ని మేనేజ్ చేస్తూ, ఉద్యోగాలకి వెళ్లే ఆడవారి వైపు ఆరాధనగా, హడావిడిగా కాలేజులకీ పార్టీలకి వెళ్లే పిల్లల వైపు ఈర్ష్యగా, ఇప్పుడే కొత్తగా వచ్చిన వారిని తేలిగ్గా చూస్తూ, గడుసుగా ఈ అమెరికా వాసాన్ని ఈదుతూన్న ఒక సగటు తెలుగు పిల్లని.

మబ్బుల చాటు తొలగిపోతున్న కొద్దీ, కాస్తకాస్తగా బయటపడుతున్న అందమైన దేశాన్ని విమానపు కిటికీలోంచి ఆనందాతిశయంతో చూసిన మొదటి క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను. చదివిన చదువూ, చేసిన ఉద్యోగం దేనివల్లనైతేనేం సిగ్గు, బిడియాలు అనే ఆభరణాలు పాతవైపోయి పర్యుత్సుకత, ఉత్సాహం అనే అలంకారాలు మాత్రమే ధరించిన ఈకాలపు అమ్మాయిని. ఎయిర్ పోర్ట్ నుండి బయట పడి అమెరికా గడ్డపై నిలబడ్డప్పుడు మొట్ట మొదటగా గమనించిన మార్పు, మనుషుల కరువు. ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కిరి చేసిన ఒంటరితనం. చిన్న కలవరపాటు. రివ్వున వీస్తున్న చల్లటి గాలికి కళ్ళలో ఊరిన తడికి అస్పష్టంగా అల్లుకుని పోయినట్టు ఉన్న బంగారు అక్షరాలు . తేరుకుని చూద్దును కదా, అరచేతిలో ఉన్న పాస్ పోర్టుపై "సత్యమేవ జయతే" అన్న అక్షరాలు. నువ్వు నా బిడ్డవి, నీకు ఎదురే లేదు అని ఏదో శక్తి భుజంతట్టిన భావన. అలా పడింది అమెరికా నేలపైన నా మొదటి అడుగు. ఇక్కడి ప్రస్తుత జీవనం, ఇన్ని సుఖాల మధ్య ఉండే కష్టాలు, ఉక్కిరిబిక్కిరి చేసేంత పని లేదా పిచేక్కించేంత ఏకాంతం, చదువుకునేందుకు పాట్లు, ఉద్యోగపు వేటలు, తల్లితండ్రుల ఆశలు పిల్లల ఆశయాలు ఇలా ఎన్నో విశేషాలు. ఈ భావోద్వేగపు రంగులరాట్నంలో నాతో పాటు షికారుకు తయారు అవ్వండి మరి..

★★★

మరైతే అందరికీ ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు. మొహమాటానికి కూడా తిరిగి మిమ్మల్ని నాకు విష్ చెయ్యమని అడగనులె. ఎందుకంటే గత సంవత్సరంలో వచ్చిన ఫేస్బుక్ మెసేజీలు, వాట్స్ ఆప్ మెసేజిలకి రిప్లై ఇస్తూ కూర్చున్న మా నాన్నగారు, "హమ్మయ్య అందరికి విషెస్ చెప్పేసాను," అని అనుకునేలోపు వచ్చేసింది ఇంకో నూతన సంవత్సరం. భారతదేశం లో 'గుడ్ మార్నింగ్ మెసేజీ' ల వల్ల స్తంభించిన ఇంటర్నెట్ ఇందుకు సాక్షి మరి. మొదట్లో సరదాగా మొదలైన ఈ శుభకాంక్షల పరంపర రాను రానూ ఇబ్బందికరంగానూ, పోను పోను తలపోటు వ్యవహారంగాను తయారయ్యాయి. అందుకనే మానసిక ప్రశాంతత కోరుకునేవారు జనవరి ఫస్టుకి ఒక రెండు రోజులు ముందూ, వెనుకా సోషల్ మీడియా కి దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

"ఏవరా నిపుణులు? ఏమా కధ? " అని నన్ను అడగనేవద్దు . ఈ మధ్యన వార్తలు చెప్పేవాడికి, వాటిని చదివేవాడు లోకువ అయిపోయాడు కదా! "వెల్లుల్లి రేకులని వేయించి పొడి చేసి, దానికి ఉల్లికాడల రసాన్ని కలిపి తాగితే మీరు కోరుకున్నది మీ సొంతం, "అని కాప్షన్ పెట్టీ, ఇంతకీ ఏమి కోరుకోవాలో అనేది చదివేవాడి విఙ్నతకి వదిలేసి, ఆన్ లైన్ వ్యూస్ లో డబ్బులేరుకునే రోజులు వచేసాయి. "నాన్న – పులి" కధలో లాగా ఏది నిజమైన వార్తో, ఏది ఉత్తుత్తి వార్తో ఎవరికి ఎరుక ?

మరి కొత్త సంవత్సరం, మొదటి తారీఖున నిఖార్సైన తెలుగు పద్ధతి ప్రకారం వెంకన్న గుడికి వెళ్లి, ఆయనకి కూడా "హ్యాపీ న్యూ ఇయర్" చెప్పేసి, నా కొత్త సంవత్సరాన్ని "అల్ హ్యాపీస్" చేసెయ్యమని ఆర్డర్ పాస్ చేసేసి వచ్చేసా. వస్తూ ఉంటె ఒక ఆలోచన వచ్చింది , "జనవరి ఒకటో తారీఖున వెంకన్నకు శుభాకాంక్షలు చెప్పివస్తున్నా కదా, అలాగే ఉగాది రోజున సరదాగా ఏసు ప్రభువుకి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్తే ఎలా ఉంటుందా!" అని . వాళ్లకేం ఎవరొచ్చినా, ఎప్పుడొచ్చినా అక్కున చేర్చుకుందామనే ఉంటారు. చుట్టూ ఉన్నవాళ్లే కదా దడి కట్టేది.

నూతన సంవత్సరం అంటే మొట్ట మొదటగా గుర్తొచ్చేవి, "తీర్మానాలు" అదే, అచ్చ తెలుగులో చెప్పాలంటే "న్యూ ఇయర్ రెసొల్యూషన్స్". డైటింగ్, ప్రాణాయామం లాంటి భారీ రెసొల్యూషన్స్ కాదు నే మాట్లాడేది. చిన్న చిన్న తీర్మానాలు, అంటే 'స్క్రీన్ టైం', సోషల్ మీడియా టైం' తగ్గించడం, నా సొంత బుర్రతో చిన్న చిన్న ఆలోచనలు చెయ్యడం లాంటివి అన్నమాట. మారుతున్న కాలంతో వచ్చే సమస్యలు కూడా అంతే వింతగా ఉంటున్నాయి మరి. మనం పెత్తనం చేద్దాం అనుకున్న యంత్రాల చేతుల్లో మనమే బొమ్మల్లా అయిపోతున్నాం. ఏది ఏమైనా ఈసారి గట్టిగా కొన్ని విషయాలు తీర్మానించేసా, అవేంటంటే,

*1.* మొదటగా ఏ విషయం గురించి అయినా నా సొంత బుర్రతో అలోచించి నిర్ణయం తీస్కోవాలి. ఫర్ సపోజ్, ఎవడో చెప్పాడనో , బాగుందనో ఒక సినిమా చూడడం కాకుండా, నాకై నచ్చి చూడాలనిపిస్తేనే చూడాలి. చూసిన వెంటనే నా అభిప్రాయాలూ, రచనా చాతుర్య చమత్కారాలు అందరికీ చూపించాలనే కసి, ఆవేశాన్ని పాప్ కార్న్ బాల్చీని నుజ్జు నుజ్జు చేసినట్టు చేసి థియేటర్లో నే ట్రాష్ చేసి రావాలి. ఇది బట్టలకి, హోటళ్ళకి కూడా వర్తిస్తుంది. మొన్నిలాగే ఎవడో రాసిన రివ్యూ, పెట్టిన పోస్టు బాగుంది కదా అనీ, అయిన డబ్బంతా పోసి లేటెస్ట్ డ్రెస్ ఒకటి కొన్నాను. అచ్చు బుడబుక్కల ఫకీరులా ఉన్నా. చివరికి పానీ పూరీ తినడానికి కూడా రివ్యూలు చూసి గానీ వెళ్లని పరిస్థితి. ఇకనుండి ఇలాక్కాదు. అవసరమైన వాటికి తప్పించి సలహాలు సంప్రదింపులు చేయరాదు. నా ప్రయాణం నేనే చేస్తా, అందులో మంచివీ,చెడ్డవీ అనుభూతులూ, కష్టాలూ , కన్నీళ్లు అన్నీనేనే రుచి చూస్తా. నా జీవన రివ్యూ నేనే రాసుకుంటా. అన్నీ పూల బాటలు ఉండాలి అనుకోను. ముళ్ల బాధ తెలీకపోతే, పువ్వు మెత్తదనం ఎలా అనుభవంలోకి వస్తుంది?

*2.* నా మనోభావాలను నా దగ్గరే అట్టిపెట్టు కోవాలి. కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడివిలో జరిగే విషయాలు కూడా వీడియో తో సహా అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో, తామరాకుపై నీటి బొట్టులా ఆ వార్తల్ని జార్చేసి ప్రశాంతంగా ఉండాలి. ఫలానా ఊర్లో " పగలు నైటీలు వేసుకుంటే జరిమానా ట!", "మా ఉర్లోనే మందుషాపు పెట్టండి అంటున్న ఇల్లాళ్ళు!" లాంటి వార్తలు చదివి రక్తం మరిగించుకుని, నేను రగిలిపోయి ఇంట్లో వాళ్ళని పస్తు పెట్టకుండా ఉండాలి . పొద్దున్న లేస్తే మన పనులు మనమే చేసుకోవాలి కాబట్టి, ఎవరి మనోభావాలను నొప్పించకుండా సింపుల్ గా వార్త చానళ్ల పీక నొక్కేయాలి.

*3.* మొహంలో భావాలు తెలీకుండా స్కైప్ మాట్లాడడంలో ప్రాముఖ్యత కనబరచాలి. ముఖ్యంగా అత్తారివైపు చుట్టాలు వీడియో కాల్ చేసినప్పుడు, మర్చిపోకుండా బ్యాక్ గ్రౌండ్ లో విడిచేసిన బట్టలు, జిడ్డోడుతున్న వంటిల్లు కనపడకుండా జాగ్రత్తపడాలి. ప్రాక్టీస్ కోసం దూరదర్శన్ లో వచ్చే పాత ప్రాంతీయ వార్తలు కొన్ని రోజులు చూస్తే మరీ మంచిది.

*4.* ఒకే బూర్ల మూకుడుతో కాపురం మొత్తం చేసిన, చేస్తున్న అమ్మమ్మని , అమ్మని ఆదర్శంగా తీస్కుని ఇకపై కొత్త వంట సామాను ఏదీ కూడా కొనకూడదు. చివరికి ఎదురు 'కూపన్ల' కట్నం ఇస్తానన్నా సరే , కొనరాదు . కొని ఇంటిని పాండీబజారు సామాన్ల అంగడి చేయరాదు. ఎట్టి పరిస్థితులలో ఈ విషయం అమ్మకి తెలియజేయరాదు. అమ్మో "నే చెప్పలా!" అని మొదలయ్యే ఆ సూక్తి ముక్తావళి వినడం నా తరం కాదు.

*5.* డాక్టర్ దగ్గరికి వెళ్లేముందు అడగవలసిన ప్రశ్నలన్నీ ముందే భట్టీయం వేస్కుని వెళ్ళాలి. ఎంత ప్రిపేర్ అయ్యి వెళ్లినా డాక్టర్ని చూడగానే బిగుసుకు పోయి, "ఎనీ మోర్ కంప్లయింట్స్ " అనగానే, బలశాలి, ఆరోగ్యశాలి అయిన 'ధారా సింగ్ ' కజిన్ సిస్టర్ లాగా "ఆబ్బె ఏమి లేదే" అని పళ్ళికిలించకుండా, ఒళ్ళు దగ్గరపెట్టుకుని ప్రశ్నలన్నీ అడగాలి. వీలైతే ఒక చీటీలో రాసుకుని , చూసుకుని అడిగితే మంచిది. కట్టే కో-పేమెంట్ ఒక సారి గుర్తుకు తెచ్చుకుంటే సరి. అంతే గానీ ఇంటికి తిరిగొచ్చిన వెంటనే గుర్తొచ్చే దిక్కుమాలిన నొప్పులన్నీ తలుచుకుని కుమిలిపోరాదు .

*6.* ఇండియన్ మార్కెట్ లో ట్రే లో వెనకగా ఉన్న కూరగాయలు ఆబగా లాగేసుకుని, పక్కన ఎవరికి అందకుండా చోటంతా ఆక్రమించుకుని, అందంగా కష్టపడి సర్దిన కూరగాయల్ని కోడి కెలికినట్టు కెలికేసి, వెనక నిల్చున్న వారి సహనాన్ని పరీక్షించి దర్జాగా వెళ్లిపోయే శాల్తీలని ఫెడీ మని ఒక గుద్దు గుద్ది ఆ కూరగాయల్లోనే కప్పెట్టేసే ధైర్యం సంపాదించాలి. ఆ మాట కొస్తే లోకల్ అమెరికన్ షాపుల్లో తెలీని రూల్సు చెప్పి, "ఇది కూడా తెలీదా , హౌ పిటీ !" అనేటువంటి చూపులు విసిరి, ఇండియన్ మార్కెట్టులో తోసుకు, దూసుకు, రాసుకుపోయే మనవాళ్ళని వరసాకి నిల్చోపెట్టి, వాళ్ళ నెత్తిన ఆపిల్ కాయపెట్టి, నా కళ్ళకి గంతలు కట్టుకుని చమత్కారంగా బాణాలు వదలాలి.

*7.* రోడ్డు పైన పీక్ అవర్స్ లో డ్రైవింగ్ చేసేటప్పుడు, మినిమం వెళ్లాల్సిన దానికంటే సగం స్పీడులో పాక్కుంటూ, దేక్కుంటూ వెళ్లే వాళ్ళని కసి తీరా తిట్టుకోడానికి వెనుక బేబీ సీట్ లో కూర్చుని, "ఏ కొత్త పదం దొరికితే దాన్ని పట్టేసుకుని మడతెట్టి మరాడించేద్దామా!," అని ఎదురుచూసే సిసింద్రీకి అర్థం కానీ భాషలో కొన్ని బూతులు నేర్చుకోవాలి.

*8.* సత్సంగ్ కీ , సహస్రనామ పారాయణాలకి పిలిచి, వచ్చే ముందు ఎవరెవరు ఏ చీరలు, నగలు వేసుకోవాలో వాట్సాప్ గ్రూప్ లో డిస్కస్ చేసే మా బ్యాచ్ కి ఈసారి కాషాయం వస్త్రాలు, రుద్రాక్షలు తీస్కొచ్చి, సత్సంగ్ కీ పరాయణాలకీ డ్రెస్ కోడ్ కింద మార్చాలి.

*9.* షాపింగ్ కెళ్లే ముందు చేతి సంచీ మర్చిపోయి, ఇంటికి ఓపనన్ని ప్లాస్టిక్ సంచులు తెచ్చేసి , ఎవరో పెట్టిన కాలుష్యం పోస్టులు షేర్ చెయ్యడం, అవసరం ఉన్నా లేకున్నా చేతికందినన్ని పేపర్ టవల్సు టిష్యులు వాడేసి , వృక్షో రక్షతి రక్షితః 'లాంటి మెస్సేజీలు ఫార్వర్డ్ చెయ్యడం, లాంటి పరస్పర భావ విరుద్ధమైన పనులు చేస్తూ , భూభారాన్ని ఉద్ధరించే బాధ్యత మొత్తం నా భుజాన వేసుకున్నట్లు అష్షో ఇష్షో అని బాధపడకూడదు .

*10.* పిల్లది ఇల్లు పీకి పందిరేసినా , వస్తువులు వాటి వాటి స్థానాల్లో తప్పించి ఇంక ఎక్కడైనా వున్నా, వంటిల్లు అప్పుడే సమాప్తమైన యుద్ధ రంగంలా ఉన్నా ,వెంటనే చేస్తున్న పని మానుకుని వాక్యుము, మాపు, వైప్సు తీస్కుని సివంగిలా శ్రమదానం కార్యక్రమంలో దూకకుండా నాకేమీ పట్టనట్టు, నా కంటికి అవి కనపడనట్టు తమాయించుకుని , నా పని నేను చేసుకోగలిగే స్థిత ప్రజ్ఞత అలవరచుకోవాలి. పిల్ల దాని పైన, పిల్ల తండ్రి పైన కోపం వచ్చినప్పుడు అరిచి పేరు పాడుచేసుకోకుండా తిన్నగా రూములోకి వెళ్లి తలుపేసి దిండ్లపైన పిడిగుద్దులు గుద్ది ఆవేశం చల్లార్చుకుని, శాంత గోదావరి లాగా బయటి రావాలి .

*11.* జిమ్ ప్రోగ్రాం లో జాయిన్ అయినప్పుడు, డైట్ నోట్ చేసుకుంటూ , "సౌత్ ఇండియన్ *?* టూ మచ్ పీ నట్స్ అండ్ కోకోనట్స్!"అని ఇకిలించిన ట్రైనర్ని ఫలహారానికి పిలిచి, నాలుగు రకాల దోశలు వేసి, ముప్పై రకాల చట్నీలతో వండి వడ్డించాలి.

*12.* అన్నిటికన్నా ముఖ్యమైంది, ఉన్న ఆస్తులు మొత్తం అమ్మైనా సరే, ఇద్దరు సైంటిస్ట్ లను పట్టుకుని, ఒక్కసారి తింటే వారం వరకు ఆకలి వెయ్యని ఆహార రకం ఒకటి తాయారు చేయించాలి. ఇదీ కాకపోతే కనీసం ఒక మాంత్రికుడిని పట్టుకుని ఎప్పటికీ తరగని పల్లీల పచ్చడి అక్షయ పాత్ర ఒకటి కస్టమైజ్డ్ గా చేయించుకోవాలి.

*13.* ఆఖరుగా నేను అమ్మమ్మని అయ్యేలోపు మా వారి అమ్మమ్మ చేసేటటు వంటి "పువ్వులాంటి, మెత్తని, తెల్లని, చక్కని,గుండ్రని(ట) " ఇడ్లిలు చెయ్యగలగాలి. నా చేతి ఇడ్లిలు గుటకాయ స్వాహా చేస్తూ "అమ్మమ్మ చేసే మెత్తని, చక్కని,...... "అని పాట పాడుతూ ఎదో లోకాల్లో తేలియాడే మనిషి నెత్తిపైన ఉన్నపళంగా చెట్నీ గిన్నె బోర్లించాలనే ఆశ నెరవేర్చుకోవాలి.

ఇలా ఇంకా బోలెడు ఉన్నాయి. మొత్తానికి నన్ను నేనే సంస్కరించుకోవాలని తీర్మానం చేసుకున్నానన్నమాట. మరి ఈ సంవత్సరం మీ రెసొల్యూషన్స్ ఏంటో కింద కామెంట్స్ లో చెప్పేయండి. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments